హైదరాబాద్ వార్త



## హుస్సేన్‌సాగర్‌లో సెయిలింగ్ పోటీలు

హైదరాబాద్ హుస్సేన్‌సాగర్‌లో మంగళవారం ప్రతిష్టాత్మకమైన హైదరాబాద్ సెయిలింగ్ వీక్‌ప్రారంభం అయింది. సెయిలింగ్ వీక్‌తోపాటు లేజర్ నేషనల్ ఛాంపియన్‌షిప్ పోటీలు కూడా నిర్వహించారు. ఇఎంఇ సెయిలింగ్ అసోసియేషన్, లేజర్‌క్లాస్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సౌజన్యంతో సికింద్రాబాద్ సెయిలింగ్‌క్లబ్ ఆధ్వర్యంలో పోటీలు కొనసాగాయి. లెక్కకు మించిన సంఖ్యలో సెయిలర్లు హుస్సేన్‌సాగర్‌లో తమ ప్రావీణ్యాన్ని ప్రదర్శించిన తీరు అందరినీ ఆకట్టుకుంది. ఈ ఈవెంట్‌ను ఎంఎస్‌ఎంఇ కమాండెంట్ లెఫ్టినెంట్ జనరల్ జెఎస్ సిదానా జెండా ఊపి ప్రారంభించారు.

(ప్రభాతవార్త - హైదరాబాద్)



# మెట్రోరైల్ సరికొత్త రికార్డు

**ఈనెల 3న ఒక్కరోజే 5లక్షల 10వేలమంది ప్రయాణం**

**నాగోల్-హైటెక్‌సిటీ, ఎల్బీనగర్ -కూకట్‌పల్లి రూట్లలో అత్యధికం**

**ఇప్పటివరకు 40కోట్లమందిని గమ్యస్థానాలకు చేర్చిన మెట్రోరైల్**



హైదరాబాద్, జులై 4,ప్రభాతవార్త: హైదరాబాద్ సిగలో మణిహారంగా ప్రయాణికు గమ్యస్థానాలకు చిరునామాగా మారిన మన హైదరాబాద్ మెట్రోరైల్ సరికొత్త రికార్డును నమోదు చేసింది. జులై 3న మెట్రోరైల్‌లో 5లక్షల 10వేలమంది ప్రయాణించారు. ఒక్కరోజే ఇంత భారీస్థాయిలో ప్రయాణికులు ట్రావెల్ చేయడం సరికొత్త రికార్డు. నాగోల్ నుంచి హైటెక్‌సిటీ, ఎల్బీనగర్ నుంచి కూకట్‌పల్లి రూట్లలో ఎక్కువమంది ప్రయాణించారు. ఇప్పటివరకు హైదరాబాద్ మెట్రో రైల్ 40కోట్లమంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేసింది. గత కొన్నిరోజులుగా ప్రయాణించేవారి సంఖ్య పెరుగుతూ వస్తుంది. ఆఫీసు వేళల్లో మెట్రోలో జనం రద్దీగా ఉంటున్నారు. అమీర్‌పేట్ జంక్షన్ ఉదయం, సాయంత్రం వేళల్లో కిక్కిరిసి పోతుంది. పర్యావరణ అనుకూలమైన , వేగంతమైన హైదరాబాద్‌లో సౌకర్యవంతమైన అత్యంత సుఖమైన ప్రయాణ విధానం పట్ల ప్రయాణికులు విశ్వాసం ఆమోదాన్ని సూచిస్తుందని మెట్రో సంస్థ వెల్లడించింది. హెచ్‌ఎంఆర్‌ను తాము ఇష్టపడే ప్రయాణ భాగ స్వామిగా ఎంచుకుంటూ తమ సంఘీభావాన్ని చూపిన విలువైన ప్రయాణికులకు మేము ఈవిజయా న్ని అంకితం చేస్తున్నామని ఎల్అండ్‌టి ఎంఆర్‌హెచ్‌ఎల్ ఎండీ కెవిబిరెడ్డి తెలిపారు. కొవిడ్ 19 మెట్రోపై ప్రతికూల ప్రభావాన్ని చూపిందని, ఆతర్వాత క్రమ క్రమంగా తేరుకున్నామని తెలిపారు. సంస్థలో పనిచేసే ఉద్యోగులు చేసిన నిరంతర కృషి కారణంగా అడ్డంకులను అధిగమించా మన్నారు. తెలం గాణ రాష్ట్ర ప్రభుత్వం, హైదరాబాద్ మెట్రోరైల్ నుంచి నిరంతర సహకారం, మద్దతు వల్ల నగర ప్రజలకు అత్యంత అనుకూలమైన వేగవంతమైన ప్రజారవాణా వ్యవస్థను అందించడం మాకు సాధ్యపడిందని తెలిపారు.

**ఇప్పటివరకు 40కోట్లమంది ప్రయాణం..** హైదరాబాద్ మెట్రోరైల్ 2017 నవంబర్ 28న ప్రారంభమైంది. ప్రధాని నరేంద్రమోదీ దీన్ని ప్రారంభించారు. నాటి నుంచి ఇప్పటివరకు హైదరాబాద్ మెట్రో రైల్‌లో 40కోట్ల మంది ప్రయాణం చేయడం విశేషం. మెట్రోకు రోజురోజుకూ ఆదరణ పెరుగుతుంది. ప్రయాణికుల సంఖ్య సైతం రోజురోజుకూ వృద్ధి చెందుతుంది. స్వల్పవ్యవది లోనే రోజువారి సరాసరి ప్రయాణికుల సంఖ్య 4లక్షల మార్కునుంచి 5లక్షల మార్కును అందుకుంది. తాజారికార్డుతో భారత్‌లో అత్యధిక ఆదరణ కలిగిన మెట్రో రైళ్లజాబితాలో ఒకటిగా "హైదరాబాద్ మెట్రో రైలు "నిలిచిందని విశ్లేషకులు తెలుపుతున్నారు.

## జిహెచ్‌ఎంసికి కొత్త కమిషనర్‌గా రొనాల్డ్ రోస్




హైదరాబాద్, జూలై 4 ప్రభాతవార్త : గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌కు నూతన కమిషనర్‌ను ప్రభుత్వం నియమించింది. ప్రస్తుతం ఆర్థికశాఖ కార్యదర్శిగా ఉన్న రొనాల్డ్ రోస్‌ను జిహెచ్‌ఎంసి కమిషనర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం జిహెచ్‌ఎంసి కమిషనర్‌గా కొనసాగుతొన్న లోకేష్‌కుమార్‌కు రాష్ట్ర అదనపు ప్రధాన ఎన్నికల అధికారిగా ఈసీ నియమించింది. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలకు అనుగుణంగా లోకేష్‌కుమార్‌ను బదిలీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం ఆయన స్థానంలో బల్దియా బాధ్యతలను రొనాల్డ్ రోస్‌కు అప్పగించింది.

## కూకట్‌పల్లిలో బస్సు బీభత్సం

**యువకులకు గాయాలు**

మూసాపేట, జులై 4, ప్రభాతవార్త : సికింద్రాబాద్, వారసీగూడ బుద్ధానగర్‌కు చెందిన దాసోజు నరేంజనేయ చారి (44) కెపిహెచ్‌బిలోని భీమా జ్యువెలరీ షోరూమ్‌లో మేనేజర్‌గా పని చేస్తున్నాడు. ప్రతీరోజులాగే సోమవారం కూడా డ్యూటీ పూర్తి చేసుకుని ఇంటికి వెళ్లే సమయంలో తన స్నేహితుడు స్టోర్ మేనేజర్‌గా పని చేసే ప్రదిప్త కుమార్ రౌత్ (47) ఇద్దరు కలిసి బైక్ టిఎస్13ఇఆర్3349లో బయలుదేరారు. సుమారు 10.30గంటల సమయంలో కూకట్‌పల్లిలోని పిల్లర్ నంబర్ 770 వెనక నుండి ఒక ట్రావెల్ బస్సు ఎన్ఎల్07బి0767 ఫెయిల్ కావడంతో అతి వేగంగా వచ్చి బైక్‌ను ఢీ కొంది. బైక్‌తో పాటు ఒక కారును కూడా ఢీకొంది. ప్రదిప్త కుమార్ రౌత్‌కు సర్జరీ చేయాలని డాక్టర్లు చెప్పినట్లు తెలిపారు. కావున బస్సు డ్రైవర్‌పై తగు చర్యలు తీసుకోవాలని దాసోజు నరేంజనేయ చారీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

# నగర బిజెపిలో జోష్

**బిజెపి రాష్ట్ర అధ్యక్షుడిగా కిషన్‌రెడ్డి నియామకం పట్ల హర్షం**



హైదరాబాద్, జూలై 4 ప్రభాతవార్త : బిజెపి రాష్ట్ర అధ్యక్షుడుగా కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి ముచ్చటగా మూడోసారి నియమితులు కావడంపై నగరంలో ఆపార్టీ శ్రేణుల్లో జోష్ అంతాఇంతా కాదు. వారి ఆనందానికి అవదులు లేకుండా పోయాయి.ముఖ్యంగా అంబర్‌పేట నియోజకవర్గంలో ప్రజలు హర్షతీరేకం వ్యక్తం చేస్తున్నారు.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఒకసారి, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత రెండవసారి రాష్ట్ర అధ్యక్ష బాధ్యతలు నిర్వహించారు. 2010-14 మధ్య ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు, 2014-16 మధ్య తెలంగాణ రాష్ట్ర బిజెపి అధ్యక్షుడుగా కిషన్‌రెడ్డి బాధ్యతలు నిర్వర్తించారు. 1964 మే 15వ తేదీన రంగారెడ్డి జిల్లా తిమ్మాపురం గ్రామంలో జన్మించిన కిషన్‌రెడ్డి సాధారణ కార్యకర్తగా పార్టీలో చేరి అంచెలంచెలుగా ఎదిగారు. 1977లో జనతా పార్టీలో యువనాయకుడిగా తన రాజకీయ జీవితాన్ని ప్రారంభించారు. 1980లో బిజెపి ఆవిర్భావం నుంచి పార్టీకి సేవలందిస్తున్నారు. 1982 నుంచి 1983 వరకు బిజెపి ఏపి యువమోర్చా రాష్ట్ర కోశాధికారిగా,1983లో బిజెపి రాష్ట్ర కార్యదర్శిగా పనిచేశారు. 2002లో బిజెపి జనతా యుమోర్చా జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు.కిషన్‌రెడ్డి తొలిసారిగా 2004లో పూర్వ హిమాయత్‌నగర్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. 2009లో నియోజకవర్గాల పునర్వి భజనలో హిమాయత్‌నగర్ రద్దుచేసి అంబర్‌పేట నియోజకవర్గాన్ని ఆవిర్భవించింది. ఈ నియోజకవర్గం(అంబర్‌పేట) నుంచి 2009, 2014లలో వరుసగా రెండుసార్లు కిషన్‌రెడ్డి ఎమ్మెల్యేగా విజయం సాధించడమేకాక తెలంగాణ రాష్ట్ర తొలి బిజెపి అధ్యక్షుడుగా నియమితులయ్యారు. దాదాపు ఏడు సంవత్సరాల పాటు అధ్యక్ష పదవిలో కొనసాగారు. 2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బిఆర్ఎస్ అభ్యర్థి కాలేరు వెంకటేష్ చేతిలో కిషన్‌రెడ్డి స్వల్ప ఓట్ల తేడాతో ఓడిపోయారు. అనంతరం 2019 లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ ఎంపిగా గెలిచి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా పని చేశారు. 2021 నుంచి కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రిగా కొనసాగుతున్నారు. అధిష్టానం తీసుకున్న తాజా నిర్ణయంతో ఇకపై ఆయన తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష బాధ్యతలు నిర్వహించనున్నారు.

## ట్రాఫిక్ సిబ్బందికి హెల్మెట్‌లు పంపిణీ



ట్రాఫిక్ సిబ్బందికి హెల్మెట్‌లు పంపిణీ చేస్తున్న సిపి చౌహాన్

మన్సూరాబాద్, జులై 4 ప్రభాత వార్త: రోడ్డు ప్రమాదాలలో గాయలపాలైన వ్యక్తులకు ముందుగా నైతిక మద్దతు కల్పించి ఆ వ్యక్తి ప్రాణాలను కాపాడాలనే ఉద్దేశ్యంతో యాక్సి డెండ్ ఫస్ట్ రెస్పాండర్ ట్రైనింగ్ కోర్స్‌ను ప్రారంభించామని, అందులో రహదారి ప్రక్కన ఉన్న వివిధ రకాల వ్యాపారస్థులన భాగస్వామ్యం చేశామని రాచకొం డ పోలీస్ కమీషనర్ డిఎస్ చౌహాన్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా రూ. 2 కోట్లు విలువచేసే వివిద సామాగ్రిని ఎల్‌బినగర్ సిపి క్యాంపు కార్యాలయంలో ఆయన ట్రాఫిక్ పోలీస్ సిబ్బందికి అందజేశారు.ఈ సామాగ్రిలో ఏసి హెల్మెట్, కిట్ బ్యాగులు, సన్ గ్లాసెస్, రెయిన్ కోట్లు, వాటర్ బాటిల్స్,జాకెట్లు, ఎల్‌ఈడీబ్యాటరీలు, ల్యాప్‌టాప్‌లు ఇతర వస్తువులు ఉన్నాయి, ఈ కార్యక్రమంలో జాయింట్ సిపి సత్యనారాయణ, ట్రాపిక్ డిసిపి అభిషేక్ మహంతి, శ్రీనివాస్, సాయిశ్రీపాల్గొన్నారు.

## బోనాలకు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చూడాలి : డిప్యూటీ మేయర్



అధికారులతో సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి

తార్నాక, జులై 4 ప్రభాతవార్త: రానున్న బోనాల పండుగకు భక్తుల కు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఆలయాల నిర్వాహకులు, అధికా రులు తగిన జాగ్రత్తలు తీసుకోవా లని నగర డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి పేర్కొన్నారు.బీఆర్ఎస్ కార్మిక విభాగం రాష్ట్ర అద్యక్షులు మోతె శోభన్ రెడ్డితో కలిసి నగర డిప్యూటీ మేయర్ తార్నాకలోని వారి క్యాంపు కార్యాలయంలో అధికారులతో సమావేశ మయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సికింద్రాబాద్ లష్కర్ బోనాలను పురస్కరించుకొని నియోజక వర్గంలోని అన్ని దేవాలయాల్లో బోనాలకు తగిన ఏర్పాట్లు చేసి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు, అసౌకర్యం కలుగకుండా తగని ఏర్పాట్లు చేయాలని, విద్యుత్ దీపాలు, నిరంతరం శానిటేషన్, మంచినీటి సరఫరా ఏర్పాట్లను అధికారులు నిత్యం పర్యవేక్షించాలని ఆదేశించారు. అవసరమైన చోట ఆలయాల వద్ద మరమ్మతులు, రోడ్లు, కాంపోండ్ వాల్ ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆటవిడుపులా డాక్టర్స్ క్రికెట్ టోర్నమెంట్

**బిసిసిఐ సెలక్షన్ కమిటీ మాజీ అధ్యక్షులు ఎంఎస్‌కె ప్రసాద్**



టోర్నీ బహు మతులను ఆవిష్కరిస్తున్న ఎంఎస్‌కే ప్రసాద్, భాస్కర్‌రామ్ తదితరులు

హైదరాబాద్,జూలై 4,ప్రభాతవార్త: నిత్యం బిజీగా ఉండే డాక్టర్లకు ఆటవిడుపులా స్టేట్ డాక్టర్స్ క్రికెట్ టోర్నమెంట్ ఉపయుక్తంగా.. ఉల్లాసంగా ఉంటుందని బిసిసిఐ సెలక్షన్ కమిటీ మాజీ అధ్యక్షులు ఎంఎస్‌కె ప్రసాద్ అన్నారు. ఫిల్మ్‌నగర్ కల్చరల్ సెంటర్‌లో ఎంఎస్‌కే ప్రసాద్ ఇంటర్నేషనల్ క్రికెట్ అకాడమీ, జెవిఆర్‌గ్రూప్ ఆధ్వర్యంలో జరిగిన క్రికెట్ టోర్ని జెర్సీ ఆవిష్కరణకు గౌరవ అతిధిగా హాజరై ఆవిష్కరించారు. బుధవారం నుంచి పదిరోజులపాటు ఈటోర్నమెంట్ హైదరాబాద్‌లో జరుగుతుందన్నారు. ప్రజల ప్రాణాలను రక్షించేందుకు నిత్యం బిజీగా ఉండే డాక్టర్లకు ఈక్రికెట్ టోర్నమెంట్ కాసింత మానసిక ఒత్తిడిని జయిస్తుందన్నారు. క్రీడారంగంలో క్రికెట్‌కు అత్యంత ప్రాచుర్యం ఉండటంతో యువత, అందరికి క్రికెట్ పట్ల మకునకవ అధికంగా ఉంటుందన్నారు. ఈడాక్టర్ క్రికెట్ రాష్ట్రస్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాక్షించారు. ఈకార్యక్రమంలో హైదరాబాద్ జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ ఎం.శ్రీనివాస్, నంది అవార్డు గ్రహీత ,నిర్మాత రాంకీ గర్గపర్తి, సుధా బాస్కర్‌రామ్‌గుప్త, మాలతి, వెంకట్, మురళికృష్ణ, మోహన్, కళ్యాణ్‌రాజ్, సుదర్శన్, శివాలి, సాయి పాల్గొన్నారు.

## ప్రాణం తీసిన ముగ్గు వివాదం

చాంద్రాయణగుట్ట, జూలై 4 ప్రభాతవార్త : ఇంటి ముందు వేసిన ముగ్గు విషయంలో జరిగిన గొడవకు ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన ఛత్రినాక పోలీస్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పాతబస్తీ ఛత్రినాక శివాజీనగర్‌కు చెందిన మాణిక్ ప్రభు తల్లి ఇంటి ముందు ముగ్గు వేసి ఇంట్లోకి వెళ్ళింది. కాసేపటి తరువాత పక్కనే ఉంటున్న దుర్గేష్ ఇంటి నుంచి నీరు రావడంతో మాణిక్ ప్రభు తల్లి వేసిన ముగ్గు కొట్టుకు పోయింది. దీంతో మాణిక్ ప్రభు పక్కింటి వారితో గొడవకు దిగారు. ఈ క్రమంలో రెండు కుటుంబాల వారు పిడిగుద్దులు దాడి చేసుకున్నారు. ఈ ఘర్షణలో తీవ్రంగా గాయపడిన మాణిక్ ప్రభు(35) ఒక్కసారిగా స్పృహ కోల్పోయి కింద పడిపోయాడు. కుటుంబసభ్యులు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడు. పాతకక్షల కారణంగానే మాణిక్ ప్రభును హత్య చేశారని కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## వీధికుక్కల దాడిలో 8మందికి గాయాలు



వీధికుక్కల దాడిలో గాయపడిన వ్యక్తి

పేట్‌బషీరాబాద్, జులై 4 ప్రభాతవార్త: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జీడిమెట్ల డివిజన్ పరిధిలోని ఎమ్ఎన్‌రెడ్డి కాలనీ ఫేజ్1లో వీధికుక్కలు స్వైర విహారం చేస్తూ రహదారిపై వెళ్తున్న మహిళలు, చిన్న పిల్లలు, వృద్ధులపై దాడి చేసి గాయపరుస్తున్నాయి. వీధి కుక్కల దాడి నుంచి కాపా డాలని పలుమార్లు అధికారులకు వినతి పత్రం అందజే సిన పట్టించుకోవడంలేదని కాలనీ అధ్యక్షుడు సంపత్‌గౌడ్ ఆవేదన వ్యక్తం చేశాడు. తెలంగాణలో వీధి కుక్కల దాడిలో చిన్నారులు బలైన అధికారులు మొద్దు నిద్ర వీడడం లేదని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒకే రోజు 8మందిపై దాడి చేసి గాయపరచడం బాధాకరమని, కాలనీవాసులు ఇంటి నుంచి బయటకు రావాలంటే బయపడే పరిస్థితి ఏర్పడిందని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీధి కుక్కల దాడి నుంచి పిల్లలు, వృద్ధులు, మహిళలను కాపాడాలని లేకి పక్షంలో కుత్బుల్లాపూర్ మున్సిపల్ కార్యాలయాన్ని స్థానికులందరం కలిసి ముట్టడి చేస్తామని హెచ్చరించారు.

## విధినిర్వహణలో అప్రమత్తతతో ఉండాలి

బేగంపేట జులై 4.ప్రభాతవార్త : విధి నిర్వహణలో ఎంతో అప్రమత్తంగా ఉండాలని,క్రమశిక్షణ కూడా అవసరం అని నార్త్ డిస్ట్రిక్ట్ ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ సాలె రంగారావు అన్నారు. మంగళవారం బేగంపేట లోని ట్రాఫిక్ అడిషినల్ డీసీపీ కార్యాలయంలో ట్రాఫిక్ విభాగంలో ఎస్సైలు గా విధులు నిర్వర్తిస్తూ ఇటీవల ఇన్స్‌పెక్టర్లు గా పదోన్నతి పొందిన ఎస్సైల ను అడిషనల్ డీసీపీ రంగారావు ఘనంగా సత్కరించారు.మహంకాళీ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎస్సైగా విధులు నిర్వర్తిస్తున్న ఎం.శంకర్,నారాయణ గూడా పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న మోహన్ బాబు నాయక్ ,సైఫాబాద్ పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న పి.శ్రీనివాస్,పి.నరేష్ కుమార్ లను రంగారావు సత్కరించి బొకేలను అందించి ఘనంగా సన్మానించారు.

# నోటు అందనిదే.. ముద్ర పడదు



**అవినీతికి అడ్డాగా రిజిస్ట్రేషన్ కార్యాలయాలు ❖ దళారుల ద్వారా అయితే గంటల్లో పనిపూర్తి**

**నేరుగా వెళితే కొర్రీలతో కాలయాపన ❖ అవినీతికి కళ్లెం వేయాలి : వినియోగదారులు**

హైదరాబాద్, జులై 4, ప్రభాతవార్త: నగరంలోని రిజిస్ట్రేషన్ ఆఫీసుల్లో అవినీతికి అడ్డుఅదుపు లేకుండా పోతుంది, నేరుగా వెళ్ళిన వారి రిజిస్ట్రేషన్లను చేయని అధికారులు దస్తావేజులేఖరులు తెచ్చే రిజిస్ట్రేషన్‌లను వెంటనే చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. దాంతో ప్రజలు దళారులను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని, దాంతో దళారులు అదునుగా భావించి అధికంగా వారి ఇష్టానుసారంగా వసూళ్ళకు పాల్పడుతు న్నారని, ఈ వ్యవహారం బహిరంగ రహస్యం అయినప్ప టికి ఉన్నాతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవటం లేదు. వివాహ రిజిస్ట్రేషన్‌కు 250 అధికారిక ఫీజు చెల్లించాల్సి ఉంటే, ఈలేఖరులు సుమారు రూ.1500 నుండి రూ.2000 వరకు వసూళ్ళు చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. నేరుగా వెళ్ళే వారికి ఏదో ఒక సాకు చెప్పి తిప్పి పంపడం వల్ల తప్పక వీరిని ఆశ్రయించాల్సివస్తోందని ప్రజలు వాపోతున్నారు. ఇవేకాక వాల్యువేషన్ సర్టిఫికెట్, ఈసీ ఇలా ఏం కావాలన్నా వీరినే ఆశ్రయించేలా చేయడం అధికారుల వ్యవహారతీరులో అర్థమౌతుందని ఆరోపిస్తున్నారు. దాంతో సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుల్లో దళారులదే హవా నడుస్తుంది. ప్రభుత్వం రిజిస్ట్రేషన్ ఆఫీసుల్లో దళారీ వ్యవస్థను రద్దుచేసినప్పటికీ వారి హవానే కొనసాగుతుంది. దీంతో సాధారణ ప్రజలు ఇబ్బందులకు గురి అవుతున్నారు. రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో ఎన్నో సౌకర్యాలు కల్పిస్తున్నట్లు ప్రభుత్వ ప్రచారం చేస్తున్నా.. అవి క్షేత్రస్థాయిలో అమలు కాలేకపోతున్నాయి. రిజిస్ట్రేషన్ కోసం ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకునే వీలుంది. కానీ ఆన్‌లైన్ దరఖాస్తులను పరిశీలించేనాధుడే లేడు. రిజిస్ట్రేషన్ కావాలంటే లేఖరులే అన్నీ తామై వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పొరపాటున రిజిస్ట్రేషన్ కోసం కార్యాలయానికి దరఖాస్తు పట్టుకుని వెళితే, అక్కడ సిబ్బంది అదిలేదు ఇదిలేదు అంటూ నానా కొర్రిలు పెట్టి వెనక్కి పంపిస్తున్నా రని పలు వురు విమర్శిస్తున్నారు. తప్పని పరి స్థితుల్లో దళారులకు అధిక మెత్తం చెల్లించి తమ రిజిస్ట్రేషన్‌లు చేయించాల్సి వస్తుందని సామాన్యులు వాపోతున్నారు. ఇదంతా ఎందుకులే లేఖరులకు ఇస్తే అంతా వాళ్ళే చూసుకుంటారన్న ఆలోచనను దరఖాస్తుదారులకు కల్పిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. దీనికితోడు రిజిస్ట్రార్ కార్యాలయంలో హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేయాల్సి ఉన్నప్పటికీ అవి ఎక్కడా కనిపిం చటం లేదు. వాస్తవానికి ఒక రిజిస్ట్రేషన్‌కు ప్రభుత్వం రేటు ఎంత ఉంటుందో దానికి రెట్టింపు మెత్తంలో దస్తావేజు లేఖరులు వసూలు చేస్తున్నారు. ఇందులో క్రింది స్థాయి నుండి పై స్థాయి అధికారుల వరకూ వాటాలున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. వివాహ రిజిస్ట్రేషన్, వాల్యువేషన్ సర్టిఫికేట్ల కోసం వచ్చిన వారి నుండి అధికంగా వసూలు చేస్తు పట్టుబడ్డ దాఖలాలు ఉన్నాయి. కాబట్టి అధికారులు రిజిస్ట్రేషన్ ఆఫీసులై నిఘా పెంచి కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

**బయట వెండర్ల చేతివాటం..**

జంటనగరాల్లోని దాదాపు అన్ని సెంటర్ల లోనూ పదుల సంఖ్యలో స్టాంప్ వెండర్లున్నారు. వారిపై తగిన కంట్రోల్ లేక ఇష్టానుసారం వారు అధిక రేట్లకు అమ్ము తున్నారు. కాకపోతే దానికి 'కొరత"అనే ఊతపదాన్ని జోడిస్తు న్నారు. స్టాంపు పేపర్లం టే ముద్ర వేసిన శాసనంగా భావి స్తారు. వీటిని బాండ్ అని పేపర్లు అని వ్యవహారికభాష లో పిలుస్తుం టారు. బాండ్ అంటే బద్దులమైనట్లు అంగీకరించడం. ఏవైనా లావాదేవీలు ఆపత్రాలపై రాసుకుంటే చట్టబద్ధత దక్కుతుంది. వివాదాలు ఉత్పన్న మైనప్పుడు అవి కీలక మవుతాయి. న్యాయస్థానాల్లోనూ సాక్ష్యాలుగా ఉపయోగమౌతాయి. అందుకే భూములు, స్థలాలు, ఇళ్లు, ప్లాట్లు, రుణాలు, అద్దె ఒప్పందాలు వంటి ఒకరి నుంచి మరొకరికి మార్పిడి ఇతర లేదా అనేక సందర్భాల్లో వీటిని విరివిగా వాడతారు.

సాధారణ ప్రజల నుంచి సంపన్నుల దాకా అందరికి స్టాంప్ పేపర్లు అవసరమవుతాయి. మన మహానగరంలో రోజుకు లక్షల్లో ఈస్టాంప్ పేపర్ల ఖరీదు జరుగుతుంది. నిజానికి వాటిని సబ్‌రిజిస్ట్రార్ (ఎస్ఆర్) లేదా జిల్లా రిజిస్ట్రార్(డిఆర్) ఆఫీసుల్లో పొందవచ్చు. చాలా మంది వెండర్లు (విక్రేత)లను ఆశ్రయిస్తుంటారు. సరిగా దీన్ని అసరాతో విలువకంటే అధికంగా డబ్బులు లాగుతున్నారు. స్టాంప్ పత్రాలపై ఉండే ధరతోనే అమ్మాలి వారికి కమీషన్ ఇస్తుంది సంబంధిత శాఖ. కానీ వెంబర్లు ఎవరూ వీటిని పట్టించుకోవడం లేదు.



## ఉజ్జయినీ మహాకాళీ అమ్మవారికి భక్తితో మూడు నేత పట్టు చీరెలు



బేగంపేట జులై 4,ప్రభాతవార్త : ఆషాడ మాసం వచ్చిందంటే చాలు అమ్మ వారి ఆలయం నూతన శోభను సంతరించు కుంటుంది.రంగు రంగుల పూలతో పాటు వినూత్నమైన విద్యుద్దీపాల కాంతులతో ఆలయం తో పాటు పరి సరాలన్నీ సుందరంగా మారిపోతాయి. ఈ నెల 9వ తేదీన సికింద్రాబాద్ శ్రీఉజ్జయినీ మహాకాళీ ఆషాడ బోనాల జాతరలో భాగంగా బోనాలు. కార్యక్రమం, 10న రంగం ఉంటాయి. దీని దృష్ట్యా ఇప్పటికే ఆలయాన్ని రంగులతో సుందరంగా తీర్చిదిద్దారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టారు. భద్రతను దృష్టిలో ఉంచుకొని మహంకాళీ పోలీసులు భారీ బందోబస్త్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఆలయంతో పాటు ఆలయానికి వచ్చే మార్గాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి వాటిని మహంకాళీ పోలీస్ స్టేషన్ లోని కంట్రోలు రూంకు అనుసంధానం చేసారు. ఆలయ ఈ ఓ గుత్తా మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేసారు.

**అమ్మ వారికి మూడు నేత పట్టు చీరెలు, పనులు ప్రారంభించిన మంత్రి తలసాని**

ఉజ్జయినీ మహాకాళీ అమ్మ వారికి మూడు నేత పట్టు చీరెలు అందిం చేందుకు చీరెలు నేత పనులను మంగళవారం మంత్రి తలసాని శ్రీని వాస్ యాదవ్ ఆలయంలో ఏర్పాటు చేసిన మగ్గంపైన ప్రారంభించారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం ఎస్ లింగోటం గ్రామానికి చెందిన ఇడెం వెంకటేశ్వర్లు, అదే జిల్లా రఘునందపురం గ్రామానికి చెందిన చెన్న ఉపేందర్‌లు మూడు నేత పట్టు చీరెలను మగ్గంపైన నేసి శుక్రవారం నాటికి అమ్మవారికి అందించనున్నారు.

## స్వామి వివేకానంద నేటి యువతకు ఆదర్శం

**హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ**

ధర్నాచౌక్.. స్వామి వివేకానంద నేటి యువతకు ఆదర్శమని హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. మంగళవారం స్వామి వివేకానంద వర్ధంతి సందర్భంగా ట్యాంక్‌బండ్‌పై నున్న స్వామి వివేకానంద విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దత్తాత్రేయ మాట్లాడుతూ మన భారతదేశ ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన మహనీయుడు స్వామి వివేకానంద అని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీజేపీ నాయకులు రమేష్‌రాం, మహేందర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## బోనాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలి

**టెలికాన్ఫరెన్స్‌లో మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్**



బేగంపేట జులై 4,ప్రభాతవార్త : బోనాల ఉత్సవాల సందర్భంగా భక్తులు ఎలాంటి ఇబ్బందులకు గురి కాకుండా ఏర్పాట్లను పర్యవేక్షించాలని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు.మంగళవారం నగరానికి చెందిన మంత్రులు మహమూద్‌ఆలీ,సబితా ఇంద్రారెడ్డి, మేయర్ గద్వాల విజయలక్ష్మి,డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతా శోభన్‌రెడ్డి,ఎమ్మెల్సీలు,ఎమ్మెల్యేలతో టెలికాన్ఫ రెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ ఈ నెల 9వ తేదీన సికింద్రా బాద్ బోనాలు,16వ తేదీన ఓల్డ్‌సిటీ బోనాలు జరుగు తాయని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రశేఖరరావు ఆదేశాల మేరకు వివిధ శాఖల ఆధ్వర్యంలో అన్ని రకాలైన ముందస్తు ఏర్పాట్లు జరుగుతున్నాయని చెప్పారు. ప్రజా ప్రతినిధులు ఏర్పాట్లలో భాగస్వాము లై పర్యవేక్షించాలని,ఇంకా ఏమైనా ఏర్పాట్లు అవసర మైతే సంబంధిత శాఖల అధికారుల దృష్టికి తీసికెళ్లాలని చెప్పారు. భక్తులు క్యూలైన్లలో తోపులాటకు గురికా కుండా పటిష్టమైన బారికేడ్‌లను ఏర్పాటు చయడంతో పాటు పోలీసు బందోబస్త్,శాంతి భద్రతల పర్యవేక్షణ కోసం అవసరమైన ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ టెలి కాన్ఫరెన్స్ లో ఎమ్మెల్సీలు ప్రభాకర్‌రావు,సురభి వాణీదేవి, శంభీపూర్‌రాజు,ఎమ్మెల్యేలు మాగంటి గోపీనాథ్, ముఠా గోపాల్, కాలేరు వెంకటేష్,మైనంపల్లి హన్మం తరావు, వివేక్,అరికపూడి గాంధీ మంత్రితో మాట్లాడారు.

# గడచిన నాలుగేళ్ళలో ఊహించని రీతిలో అభివృద్ధి : మంత్రి



అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టి ప్రసంగిస్తున్న మంత్రి సబితా ఇంద్రారెడ్డి

**సరూర్‌నగర్, జూలై 4 ప్రభాతవార్త:** గడచిన నాలున్నర సంవత్సరాల కాలంలో మహేశ్వరం నియోజకవర్గంలో ఎవ్వరూ ఊహించని రీతిలో అభివృద్ధి జరిగిందని రాష్ట్ర విద్యాశాఖమంత్రి, స్థానిక శాసనసభ్యురాలు పట్లోళ్ళ సబితా ఇంద్రా రెడ్డి స్పష్టం చేశారు. నగర శివార్లలోని మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో రూ.2.09 కోట్లతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు మంత్రి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా 15వ డివిజన్‌లో రూ.1.59 కోట్లతో ఏర్పాటు చేయనున్న సిసి రోడ్లు, భూగర్భ డ్రైనేజీ నిర్మాణపు పనులకు అదే విధంగా 45వ డివిజన్‌లో రూ.50 లక్షలతో నిర్మించనున్న సిసి రోడ్డు పనులకు ఆమె శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశాల్లో మంత్రి మాట్లాడుతూ గడచిన నాలుగున్నరేళ్ళ కాలంలో నియోజకవర్గంలో ప్రజలకు కావాల్సిన మౌళిక సదుపాయాలకు ప్రాధాన్యతనిస్తూ రహదారుల విస్తరణ, తాగు నీటి పైపులైన్లు, వాటర్ ట్యాంకుల నిర్మాణం, వరద నివారణకు నాలాల నిర్మాణం, చెరువుల సుందరీకరణ తదితర అభివృద్ధి పనులు చేశామని తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి సిఎం కెసిఆర్, పురపాలక శాఖ మంత్రి కెటిఆర్‌లు పెద్ద ఎత్తున ప్రత్యేక నిధులు మంజూరు చేసి సహకరించారనీ ఈ మేరకు వారికి ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేయర్ ముడావత్ దుర్గ దీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, కమీషనర్ చిట్టి నాగేశ్వర్‌రావు, డిఇఇ గోపినాథ్, పార్టీ ఫ్లోర్ లీడర్ అర్కల భూపాల్‌రెడ్డి, పలువురు కార్పొరేటర్లు, బిఆర్ఎస్ నాయకులు, స్థానిక కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

## బ్రిటిష్ ప్రభుత్వాన్ని ఎదురించిన అల్లూరి

**ఎల్.బి.నగర్, జులై 4 ప్రభాతవార్త:** ఆర్‌కేపురం డివిజన్ చిత్రలేవుట్ వద్ద గిరిజన సంఘం ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు 126వ జయంతి వేడుకలు నిర్వహించారు. గిరిజన సంఘం రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు యం.గోపినాయక్ అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గోపినాయక్ మాట్లాడుతూ భారత స్వాతంత్ర్యం కోసం గెరిల్లా యుద్ధరీతిలో పోరాడిన విప్లవ యోధుడు అల్లూరి బ్రిటిష్ ప్రబుత్వాన్ని ఎదరించి పోరాటం చేసి ప్రజాల కోసం ప్రాణాత్యాగం చేసిన మహా నాయకుడు అని పేర్కొన్నారు. మన్యం ప్రజల హక్కుల కోసం, దేశ స్వాతంత్రం కోసం పోరాడి 27 ఏళ్ల చిన్న వయసులోనే ప్రాణాత్యాగం చేసిన త్యాగశీలి అల్లూరి అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రబుత్వాలు గిరిజన అభ్యున్నతి కోసం కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కట్ట శ్రీనివాస్, కే.రాములు, పరుషరాములు తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి పార్టీ అభివృద్ధికి కృషి చేస్తా : సందీప్



నియామక పత్రాన్ని అందుకుంటున్న బిజెపి మోర్చా రాష్ట్ర సందీప్

**కుషాయిగూడ, జూలై 4 ప్రభాతవార్త :** పార్టీ అభ్యర్ధికి అహర్నిశలు కృషి చేస్తానని భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కో కన్వీనర్ గా పర్కిబండ సందీప్ పేర్కొన్నారు. ఉప్పల్ నియోజకవర్గానికి చెందిన సందీప్ సేవలను గుర్తించి భారతీయ జనతా పార్టీ ఓబిసి మోర్చా రాష్ట్ర అధ్యక్షులు కాలే భాస్కర్ రాజ్ ఓబీసీమోర్చా రాష్ట్ర ఐటీ కో కన్వీనర్‌గా నియమిస్తూ అధికారిక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ తనకు అప్పగించిన బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వహించి పార్టీ అభివృద్ధికి పాటుపడతానన్నారు. అప్పగించిన అధిష్టానానికి కృతజ్ఞతలు తెలిపారు.

## 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలి

**ఎల్.బి.నగర్, జులై 4 ప్రభాతవార్త:** 18సంవత్సరాలు నిండిన యువతీ యువకులు ఓటు హక్కును నమోదు చేసుకోవాలని సహాయ ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ అధికారులు జయశ్రీ,నర్సింగ్‌రావు సూచించారు. సరూర్‌నగర్ మండల పరిధిలోని పోలింగ్ కేంద్రాలను ఎన్నికల కమిషనర్ ఆదేశాల మేరకు మంగళవారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వృద్ధులు, వికలాంగులు పోలింగ్ కేంద్రాలకు వెళ్లేందుకు ర్యాంపులు వండే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు బూత్ లెవెల్ భవనాలను పరిశీలించడం జరిగిందన్నారు. పోలింగ్ కేంద్రాలకు వచ్చే ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వసతులు కల్పిస్తున్నామన్నారు. వృద్ధుల కోసం ఇంటి వద్దకే బ్యాలెట్ పేపర్‌ను పంపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపతహసిల్దార్ అవినాష్ కుమార్ పాల్గొన్నారు.

## యువత క్రీడలపై ఆసక్తిని పెంచుకోవాలి : రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లింగాల హరిగౌడ్




టీ షర్ట్స్ పంపిణీ చేస్తున్న హరిగౌడ్

**సైదాబాద్, జులై 4 ప్రభాతవార్త:** యువత క్రీడలపై ఆసక్తిని పెంచుకోవాలని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లింగాల హరిగౌడ్ అన్నారు. ఆస్మాన్‌ఘడ్ లోని ఆయన నివాసంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో యువకులకు టీషర్ట్స్, ట్రాక్ ప్యాంట్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా హరిగౌడ్ మాట్లాడుతూ క్రీడలు శారీరక ధృడత్వాన్ని కలిగించడంతోపాటు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో పటాలే నవీన్ కుమార్, శ్రీకాంత్, సుమన్, రమేష్, పాషా, కిరణ్, నయీమ్, శ్రవణ్, దేవ కుమార్. షరీఫ్,. ముత్యాలు, రాము, సాయి తదితరులు పాల్గొన్నారు.



స్వామి వివేకానందుడి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సామ సుందర్‌రెడ్డి, జంగం శ్వేత మధుకర్‌రెడ్డి

(ప్రభాతవార్త, సైదాబాద్)

## రోడ్డు నిర్మాణం పూర్తితో ఉత్సవం : శ్రీవాణి



పరమాన్నం వండుతున్న శ్రీవాణిఅంజన్‌కుమార్

**ఎల్.బి.నగర్, జులై 4 ప్రభాతవార్త:** సిసి రోడ్ల నిర్మాణ పనులు సకాలంలో పూర్తి అయిన సందర్భంలో సరూర్‌నగర్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణిఅంజన్ కుమార్ తేనేటి విందు కార్యక్రమంలో భాగంగా పరమాన్నం వండి ఉత్సవాలు జరిపారు. సరూర్‌నగర్‌లో సీసీ రోడ్ల పనులు సకాలంలో పూర్తి అయిన సందర్భంలో స్థానికులు, ప్రబుత్వ అధికారులతో కలిసి కార్యక్రమం నిర్వహించామని కార్పొరేటర్ తెలిపారు. అభివృద్ధి పనులకు నిధులు తేవడంతోపాటు పనులు పూర్తి అయ్యేంతవరకు వాటిని పర్యవేక్షించడం కూడా నా బాధ్యత అన్నారు. నిధులు మంజూరు అయినప్పటికీ రకరకాల కారణాలవల్ల పనులు నిలిచిపోతాయని, పనులు పూర్తయిన నేపథ్యంలో స్థానికులలో ఆనందం నెలకొంటుందన్నారు.

## మహనీయుల ఆశయాలను యువత స్ఫూర్తిగా తీసుకోవాలి : సిఐ సీతారాం, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్

**జవహర్‌నగర్, జూలై 4 ప్రభాతవార్త :** మహనీయుల ఆశయాలను నేటి యువత స్ఫూర్తిగా తీసుకొని సామాజిక సమస్యలపై పోరాడాలని జవహర్‌నగర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ సీతారాం, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్ గుప్తాలు సూచించారు. మంగళవారం స్వతంత్ర పోరాట యోధులు అల్లూరి సీతారామ రాజు జయంతి, తెలంగాణ సాయుధ పోరాటయోధుడు దొడ్డి కొమురయ్య వర్ధంతి, స్వామి వివేకానంద వర్ధంతి సందర్భంగా జవహర్ నగర్ లోని బిఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్ రావ్ విగ్రహాల ఆవరణలో మహనీయుల ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ స్వాతంత్ర్యంకోసం బ్రిటిష్ వారితో పోరాడిన మహనీయుడు అల్లూరి సీతారామరాజు అని కొనియాడారు. భూమి కోసం, బుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం జరిగిన తెలంగాణ సాయుధ పోరాటంలో రజాకార్లతో వీరోచితంగా పోరాడి ముష్కరుల దాడిలో మృతి చెందిన తొలి అమరజీవి దొడ్డి కొమురయ్య అని అన్నారు. భారతదేశ ఖ్యాతిని ప్రపంచ దేశాలకు చాటిన గొప్ప మహనీయుడు స్వామి వివేకానంద అని, ఆయన చూపిన మార్గంలో నేటి సమాజం నడుచుకోవాలని పలువురు వక్తలు సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మేక లలిత యాదవ్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్, బిజెపి పార్టీ అధ్యక్షుడు రంగుల శంకర్ నేత, బీఎస్పీ అధ్యక్షులు యాకస్వామి, ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు కొయ్యడ వెంకటేష్,మాజీ ఎంపీటీసీ సభ్యులు రంగుల సతీష్ నేత, ఇండియన్ ఫార్వర్డ్ బ్లాక్ అధ్యక్షులు జంగిటి శ్రీనివాస్, మహనీయుల ఉత్సవ కమిటీ అధ్యక్షులు మండల సురేందర్, నాయకులు డాక్టర్ రాజు, కంది పెంటాచారి, ఆనంద్, ఉపేందర్, రావుల ఐలయ్య, చిన్నపురం యాదయ్య, బూడిద వెంకటేష్, శ్రీనాథ్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా మంచినీటి సరఫరా : భవాని ప్రవీణ్



పనులు పరిశీలిస్తున్న భవాని ప్రవీణ్‌కుమార్ తదితరులు

**ఎల్.బి.నగర్, జులై 4 ప్రభాతవార్త:** ప్రజలకు ఇబ్బందులు కలగకుండా మంచి నీటి సరఫరా జరిగే విధంగా చర్యలు చేపట్టడం జరిగిందని గడ్డిఅన్నారం డివిజన్ మాజీ కార్పొరేటర్ భవాని ప్రవీణ్‌కుమార్ తెలిపారు. హుస్సేన్ మటన్ షాపు వద్ద టొన్నెలింగ్ పనులు జరుగుతుండగా మంచినీటి పైప్‌లైన్ పగిలిందని, దీంతో పిఅండ్‌టీ కాలనీ వాసులకు మంచినీటి సరఫరాలో అంతరాయం ఏర్పడడంతో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం తాత్కాలిక మరమ్మతులు చేపట్టి కాలనీవాసులకు మంచినీటి సరఫరా చేయడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. మరో రెండుమూడు రోజులలో మరమ్మతు పనులు పూర్తి అవుతాయని కాలనీవాసులకు మంచినీటి సరఫరాలో ఏర్పడుతున్న అంతరాయానికి క్షమించాలని ఆయన కోరారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు అధికారులు సమన్వయంతో పని చేస్తూ పనులు పూర్తి చేస్తున్నారని తెలిపారు. త్వరలో సక్రమంగా మంచినీటి సరఫరా జరుగుతుందన్నారు.

## మీర్‌పేట్ ఉమ్మడి దేవాలయాల ఛైర్మన్‌గా పల్లె పాండుగౌడ్ ఏకగ్రీవంగా ఎన్నిక

**సరూర్‌నగర్, జూలై 4 ప్రభాతవార్త:** మీర్‌పేట్‌లోని శ్రీ నల్ల పోచమ్మ, ఎర్ర పోచమ్మ దేవాలయ కమిటీ నూతన ఛైర్మన్‌గా మాజీ సర్పంచ్ పల్లె పాండు గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పునర్నిర్మాణం జరిగిన ఆలయంలో మంగళవారం దేవాలయ నూతన కమిటీ ఏర్పాటు కోసం గ్రామస్తులు సమావేశం నిర్వహించారు. పెండ్యాల నర్సింహ, ఉయ్యాల నవీన్‌గౌడ్, పల్లె జంగయ్య గౌడ్‌ల ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో ఆలయ కమిటీ ఛైర్మన్‌గా పాండుగౌడ్, వైస్ ఛైర్మన్‌గా కార్పొరేటర్ కీసరి గోవర్ధన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా గుమ్మాల వెంకటేష్, సహాయ కార్యదర్శిగా పెండ్యాల సంతోష్, సంయుక్త కార్యదర్శిగా ఉయ్యాల మణి, కార్యనిర్వాహక కార్యదర్శిగా పల్లె అరవింద్ గౌడ్, కోశాధికారిగా పెండ్యాల సత్యనారాయణ, సలహాదారులుగా పల్లె జంగయ్యగౌడ్, ఘట్టమనేని హనుమంతరావు, ఎరుకల రాజు, రుద్రమోని యాదగిరి యాదవ్‌లు ఎన్నికయ్యారు.

## పేదల పాలిట వరం ముఖ్యమంత్రి సహాయనిధి : ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



లబ్దిదారులకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

**సైదాబాద్, జులై 4 ప్రభాతవార్త:** సిఎం రిలీఫ్ ఫండ్ పేదల పాలిట వరమని ఎల్‌బినగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. లింగోజిగూడ డివిజన్ గ్రీన్‌పార్కు కాలనీకి చెందిన రఘు కుమారుడు ఆద్విక్ గుండెకు సంబంధించిన వ్యాధితో బాధపడుతూ ప్రైవేటు ఆసుపత్రిలో చేరి చికిత్స చేయించుకున్నాడు. అనంతరం అతని తల్లిదండ్రులు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని కలిసి తమ ఆర్థిక పరిస్థితిని వివరించి సిఎం రిలీఫ్ ఫండ్ ఇప్పించాల్సిందిగా కోరారు. ఈ క్రమంలో సిఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన లక్ష రూపాయల చెక్కును రఘుకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలు నాణ్యమైన వైద్య సేవలు పొందడానికి సిఎం రిలీఫ్ ఫండ్ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో రాకేష్ ఠాగూర్ తదితరులు పాల్గొన్నారు.

## జిహెచ్‌ఎంసిని అప్పుల కుప్పగా మార్చిన ఘనత బిఆర్ఎస్ ప్రభుత్వానిదే : సామ



ఆరేళ్లు గడిచిన శిలాఫలకానికి పాలాభిషేకం చేస్తున్న సామ రంగారెడ్డి తదితరులు

**వనస్థలిపురం, జూలై 4 ప్రభాతవార్త :** రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షులు సామ రంగారెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటికి బీజేపీ పాదయాత్రలో భాగంగా హస్తినపురం డివిజన్, కస్తూరికాలనీ, షిరిడిసాయినగర్, శ్రీరామఅయోధ్య కాలనీ భాగ్యనగర్ కాలనీతోపాటు తదితర కాలనీలలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో తెలంగాణ ప్రభుత్వం ముఖ్యంగా ఈ 9సంవత్సరాలలో జిహెచ్‌ఎంసికి నిధులు కేటాయించకుండా జిహెచ్‌ఎంసి నిధులను దారి మళ్లించిందన్నారు. నేడు జిహెచ్‌ఎంసి అప్పుల కుప్పగా మార్చిన ఘనత బిఆర్ఎస్ ప్రబుత్వానికి దక్కుతుంది అన్నారు. సాయినగర్ కాలనీలో ప్రైవేట్ ల్యాండ్‌లో డ్రైనేజి వేశారని దాంతో ప్రైవేట్ ల్యాండ్ వారు డ్రైనేజీని మూసివేయడంతో మ్యాన్‌హోళ్లు పొంగి పొర్లుతున్నాయన్నారు. అదే విధంగా కస్తూరికాలనీ నుండి భూపేష్ గుప్తనగర్ వరకు సి.సి రోడ్ నిర్మాణం కోసం లక్ష రూపాయల నిధులు మంజూరు చేసి శిలాఫలకాలతోపాటు శంకుస్థాపనలు చేసారు. నేటికి ఆరేళ్లు గడిచిన సీసీరోడ్ నిర్మాణం జరుగలేదని, మంజూరైన నిధులు ఎక్కడ పోయాయని ప్రశ్నించారు. అనంతరం 6 సంవత్సరాలు గడిచిన సందర్భంగా శిలాఫలకానికి పాలాభిషేకం చేసారు. ఇదేనా అభివృద్ధి అని ఎద్దేవా చేసారు. మౌలిక సదుపాయాలు, సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలంటే బీజేపీతోనే సాధ్యమని అన్నారు.

**హయత్‌నగర్ డివిజన్‌లో...** మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంతోపాటు గడప గడపకు బిజెపిలో భాగంగా హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని వివిధ కాలనీలలో అల్పకాలిక విస్తారక్ సురేష్‌బాబు ఓఇ (తమిళనాడు ..సేలం), స్థానిక కార్పొరేటర్ కళ్ళెం నవజీవన్‌రెడ్డితోపాటు డివిజన్ అధ్యక్షుడు యు.యెల్లప్ప, గోవిందాచారి, మహిళా మోర్చా... పార్వతి, సుజాతరెడ్డి, వివిధ స్థాయిలలో ఉన్న యువత, కార్యకర్తలు, తదితరులు పాల్గొని తొమ్మిది సంవత్సరాలుగా కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న అనేక పథకాలను, రైతులు, చిన్న చిన్న వ్యాపారులకు, మహిళలకు, ఇస్తున్న స్కీం లను, విస్తృతంగా పర్యటించి ప్రజలకు కరపత్రాల ద్వారా వివరించారు.

## నాలా పనులు త్వరగా పనులు పూర్తి చేయాలి : కార్పొరేటర్ వై.ప్రేమ్‌కుమార్



నాలా నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ తదితరులు

**మల్కాజిగిరి, జూలై 4 ప్రభాతవార్త :** ఈస్ట్ ఆనంద్‌భాగ్ డివిజన్ పరిధిలోని సత్యరాఘవేంద్రకాలనీలో కొనసాగుతున్న నాలా నిర్మాణ పనులను కార్పొరేటర్ వై.ప్రేమ్‌కుమార్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ నాలా పనులు త్వరగా పనులు పూర్తి చేయాలని అధికారులకు తెలిపారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. డివిజన్‌లో ఇప్పటివరకు అనేక అభివృద్ధి పనులు చేపట్టామని, డివిజన్‌లో త్వరలో మరిన్ని అభివృద్ధి పనులను చేపడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ లౌక్యా, ఏఈ శ్రీకాంత్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రజినీకాంత్, సంపత్‌రావు, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## వేగవంతంగా అభివృద్ధి పనులు : అబ్రార్



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న అబ్రార్

**మలక్‌పేట, జూలై 4 ప్రభాతవార్త :** అజంపుర డివిజన్‌లో వేగవంతంగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు డివిజన్ ఎంఐఎం నాయకుడు అబ్రార్ పేర్కొన్నారు. అజంపుర డివిజన్‌లోని చంచల్‌గూడలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను జిహెచ్‌ఎంసి అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్‌లో ఇప్పటివరకు పలు అభివృద్ధి పనులు చేపట్టడడం జరిగిందన్నారు. ప్రణాళికబద్ధంగా డివిజన్‌లో అభివృద్ధి పనులను చేపడుతున్నట్లు తెలిపారు. త్వరలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడడానికి ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు ఆయన సూచించారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి వారి సంక్షేమానికి కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు డబుల్ బెడ్ రూం ఇళ్ళను నిర్మించి ఇవ్వడంలో తెలంగాణ సర్కార్ విఫలం: బిజెపి



అసంపూర్తి డబుల్ బెడ్ రూంలను, నాటి శిలాఫలకాన్ని పరిశీలిస్తున్న అందెల

**సరూర్‌నగర్, జూలై 4 ప్రభాతవార్త:** హైదరాబాద్ శివార్లలో పేదలకు డబుల్ బెడ్ ఇళ్ళను నిర్మించి ఇవ్వడంలో తెలంగాణ సర్కార్ పూర్తిగా విఫలమైందని రాష్ట్ర బిజెపి కార్యవర్గ సభ్యుడు, ఆ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఇంఛార్జి అందెల శ్రీరాములు యాదవ్ విమర్శించారు. మహాజన సంపర్క్ అభియాన్‌లో భాగంగా గడప గడపకు బిజెపి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న శ్రీరాములు యాదవ్ 13వ రోజు మంగళవారం నియోజకవర్గంలోని బడంగ్‌పేట్ కార్పొరేషన్ మల్లాపూర్‌లో పాదయాత్రలు చేస్తూ పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మల్లాపూర్‌లో 2017వ సంవత్సరంలో కెసిఆర్ ప్రభుత్వం పేదల కోసం రూ.233 కోట్లతో చేపట్టిన 2700 డబుల్ బెడ్ రూం ఇళ్ళ నిర్మాణానికి సంబంధించిన శిలాఫలకాన్ని అదే విధంగా అసంపూర్తిగా ఉన్న ఇళ్ళను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేదల స్వంత ఇంటి కలను నెరవేర్చడంలో కెసిఆర్ నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చే హామీలను నెరవేర్చరని ఆయన విమర్శించారు. తెలంగాణలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత డబుల్ బెడ్ రూం ఇళ్ళ నిర్మాణాన్ని పూర్తి చేయించి లబ్ధిదారులకు అందజేస్తుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ పార్టీ అధ్యక్షుడు చెరుకుపల్లి వెంకట్‌రెడ్డి, పలువురు కార్పొరేటర్లతో పాటు మద్ది రాజశేఖర్‌రెడ్డి, గౌర శ్రీనివాస్, పోరెడ్డి జగన్మోహన్‌రెడ్డి, దొడ్డి శ్రీశైలం, మర్రి ప్రభాకర్‌రెడ్డి, వరికుప్పల వెంకటేశ్, రామిడి శూరకర్ణారెడ్డి, సంతోష్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో టాయిలెట్ల నిర్వహణకు కౌన్సిల్ సమావేశంలో 20లక్షల నిధుల కేటాయింపుకు తీర్మాణం

**సరూర్‌నగర్, జూలై 4 ప్రభాతవార్త:** పేద విద్యార్థులు చదువుకుంటున్న బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని ప్రభుత్వ పాఠశాలల్లో టాయిలెట్ల నిర్వహణకోసం కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశంలో రూ.20లక్షలు కేటాయించి ఆమోదం తెలిపినందుకు డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్ కార్పొరేటర్లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన కార్పొరేషన్ కార్యాలయంలో డిఇఇకి ప్రభుత్వ పాఠశాలల వివరాలు, అందులో చదువుకుంట్ను విద్యార్థుల వివరాలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ఆత్మగౌరవం ముఖ్యంగా బాలికల ఆత్మగౌరవం కాపాడానికి ముందుకు వచ్చి ప్రభుత్వ పాఠశాలల్లో మూత్రశాలలు, మరుగుదొడ్ల క్లీనింగ్ కోసం కార్పొరేషన్ తరపున నిధులు కేటాయించడం హర్షణీయమన్నారు. ఈ నేపథ్యంలో టెండర్ ప్రక్రియ ప్రారంభించాలని ఆయన డిఇఇ అశోక్‌రెడ్డిని కోరారు.

## బోనాల ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలి : ఎమ్మెల్యే అహ్మద్ బలాల



ఎమ్మెల్యే బలాలను సన్మానిస్తున్న బసవరాజ్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు

**మలక్‌పేట, జూలై 4 ప్రభాతవార్త :** ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో ప్రశాంతంగా జరుపుకోవాలని మలక్‌పేట నియోజకవర్గ ఎమ్మెల్యే అహ్మద్ బలాల పేర్కొన్నారు. మలక్‌పేట మైత్రి కమిటీ అధ్యక్షుడు లింగాల శ్రీనవాస్ గౌడ్, గడ్డిఅన్నారం ఉమామహేశ్వర దేవాలయం ఛైర్మన్ లింగాల బసవరాజ్ గౌడ్‌ల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే బలాలను మర్యాదపూర్వకంగా కలిసి బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేసి పుష్పగుచ్ఛాలను అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించారు. రానున్న బోనాలపండుగను పురస్కరించుకుని ఆలయాల వద్ద సౌకర్యాలను కల్పించి, రోడ్లు, లైటింగ్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా వెంటనే స్పందించిన ఎమ్మెల్యే బలాల ఆలయాల వద్ద అన్ని సౌకర్యాలను కల్పిస్తామని హామీనిచ్చారు. ఉత్సవాలు మత సామరస్యాన్ని ప్రతిబింబిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, గొట్టిపర్తి ఉరేష్‌గౌడ్, లింగాల శ్రీనప్పగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ధర్నా



ఎంపిడిఓకు వినతి పత్రం సమర్పిస్తున్న సిఐటియు నాయకులు, కార్మికులు

**అబ్దుల్లాపూర్‌మెట్, జూలై 4 ప్రభాతవార్త :** గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఎంపీడీవో కార్యాలయం ముందు ధర్నా చేసి ఎంపీడీవో వినతి పత్రం సమర్పించడంతోపాటు ఈ నెల 6వ తేదీనుండి సమ్మె చేపడుతున్నామని నోటీసును అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు ఏర్పుల నరసింహ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తర్వాత కెసిఆర్ అనేక వాగ్దానాలుచేసి ఇప్పటివరకు గ్రామపంచాయతీ కార్మికులకు చేసింది ఏమీ లేకపోగా, జనాభా ప్రాతిపదిక పేరుతో ఒక గ్రామానికి 20మంది అవసరముంటే ముగ్గురికి మాత్రమే రూ.8500 ఇస్తామని మెలిక పెట్టి, చాటలో తవుడు పోసి కుక్కలకు కొట్లాట పెట్టినట్టు కార్మికుల, జీవితాలతో ఆడుకుంటున్నారే తప్ప వారి బతుకులకి గ్యారెంటీ లేకుండా పోయింది. గ్రామపంచాయతీ కార్మికులకు ప్రతి నెల ఇవ్వాల్సిన సబ్బులు, నూనెలు, సంవత్సరానికి ఒకసారి చెప్పులు, డ్రస్సులు ఇవ్వాల్సి ఉండగా అవి కూడా ఇవ్వడం లేదన్నారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుతూ ఉత్తమ అవార్డులు పొందడమంటే అది గ్రామ పంచాయతీ కార్మికుల శ్రమ అనేది మర్చిపోయి, వారికి ఉద్యోగ భద్రత లేకుండా ఈఎస్ఐ, పిఎఫ్‌లాంటి సౌకర్యాలు కల్పించకుండా వారిచేత వెట్టిచాకిరి చేయించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కార్మికులకి రావాల్సిన వేతనాలు, సబ్బులు నూనెలు ఇవ్వాలని, కార్మికులందరికీ ఐడెంటిటి కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ నెల 6వ తేదీ నుంచి జరగబోయే సమ్మెను విజయవంతం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు గుండె శివకుమార్, బూర ప్రభాకర్, గ్రామపంచాయతీ కార్మికులు మండల అధ్యక్షుడు అంజయ్య, పూశయ్య, లక్ష్మమ్మ, లలిత, కవిత, జ్యోతి, లక్ష్మయ్య, శోభ, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.